ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

బుధవారం | సెప్టెంబరు 02, 2026 | సంపుటి : 7 | సంచిక : 80 | పేజీలు : 2




## భారత్–అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి

- ఎంపీ కడియం కావ్యకు రైతు సంఘాల నాయకుల వినతి

2లో

### మంత్రి సురేఖకు కాంగ్రెస్

## అధిష్ఠానం పిలుపు

- ఢిల్లీకి వెళ్లిన మంత్రి సురేఖ



**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ దిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు నేపథ్యంలో ఆమె వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా ఆమె కోరారు.

ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను అధిష్ఠానానికి టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ దిల్లీకి వెళ్లడం.. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

**మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం..**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. (మిగతా 2లో..)




### 1000 రోజులైనా..

## ఒక్క హామీ నెరవేర్చలే

- కాంగ్రెస్‌పై ప్రజలకు విసుగొచ్చింది..
- ప్రజల పక్షాన శాంతియుత నిరసనలు
- మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, చల్లా, నన్నపునేని

**హనుమకొండ, ఆయుధం:** కాంగ్రెస్ అధికారం చేపట్టి వెయ్యి రోజులైనా ఒక్క హామీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం మాజీ కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి తో కలిసి వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో 420 హామీలు, 6 గ్యారంటీలు ఇచ్చి అదికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పి 1000 రోజులు ఐనా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజల పక్షాన శాంతి యుత నిరసనలు ధర్నాలు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుండి 9 వ తేదీ వరకు 420 హామీలను అమలు గురించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలతో పాటు చెప్పని అనేక పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుడు వెనకాల ఉండి అనేక భూ కబ్జాలు జరిపిస్తున్నాడని విమర్శించారు. నాకు సంస్కారం ఉంది, లేకుంటే మీలాగా అనేక బూతులు మాట్లాడతామని పేర్కొన్నారు. కాజీపేట వైఎస్సార్ నగర్లో గుడిసెలు లేకుండా చేయడం అభివృద్ధా?. అని మాజీ చీఫ్ విప్ దాస్యం ప్రశ్నించారు. మైనారిటీల షాది ఖానా నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని తీసుకున్నారని ఆరోపించారు. హరీశ్ రావు పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులకు మద్దతు తెలపడానికి వెళ్ళడానికి, వెళ్తుంటే అక్రమంగా అరెస్ట్ చేపించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పై ప్రజలకు విసుగు వచ్చిందని.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చ వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి దగ్గర అని చెప్తున్నారు కదా.. జీవో నెంబర్ 97న రద్దు చేపించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. బాకీ కార్డులతో పరకాల నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని (మిగతా 2లో..)



### నూతన దంపతులకు 'వేముల' ఆశీర్వాదం

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయూ) నేషనల్ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్ - రజిత దంపతుల ప్రథమ కుమార్తె అక్షయ, నిశాంత్‌ల వివాహ రిసెప్షన్‌కు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, IJU నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు, ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

– హనుమకొండ, ఆయుధం

# ప్రభుత్వానికి ఊరట

### కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన ధర్మాసనం

- సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసిన సీజే ధర్మాసనం
- 12 ఏళ్ల నుంచి కొనసాగుతున్న పథకాలపై సింగిల్ జడ్జి స్టే విధించారన్న ఏజీ





**హైదరాబాద్, ఆయుధం:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం 2014 సంవత్సరం నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో ఈ పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

**ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని వాదనలు**

అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 సంవత్సరం నుంచి అమలు అవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందని గుర్తు చేశారు. ఈ పథకాల అమలు పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడం లేదని అన్నారు. అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతే కాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదని తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు.

షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీం కోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమని ఎ.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందని తెలిపారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

**గత నెల 12న స్టే**

తెలంగాణలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ గత నెల 12న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకాల అమలు కోసం 2014 నుంచి జారీ చేసిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) అమలుపై కోర్టు స్టే విధించింది. అలాగే వీటి కింద ఎంపికైన లబ్ధిదారులకు ఎటువంటి చెల్లింపులు చేయకూడదని ఆదేశించింది. ఈ పథకాలకు సంబంధించిన జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ఈ అంశంపై విచారణ చేపట్టారు. వాదనల సందర్భంగా ఈ పథకాల అమలు కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు రాజ్యాంగపరమైన చెల్లుబాటు లేదని పిటిషనర్ వాదించారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

## విడుదల చేయాలి: హరీశ్‌రావు



**హైదరాబాద్, ఆయుధం:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు.

"ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### ప్రజాస్వామ్య స్వరాన్ని

## అణచివేస్తే సహించబోం

- రాహుల్ గాంధీపై కేసులు ఎత్తివేసి బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**వరంగల్, ఆయుధం:** ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలను సహించబోమని ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టడం సరికాదని వాటిని వెంటనే తొలగించి కాంగ్రెస్ పార్టీకి బిజెపి బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వెంకట్రామ జంక్షన్ వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీ కి మద్దతుగా నినాదాలు చేస్తూ, అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న రాహుల్ గాంధీ పై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ... "రాహుల్ గాంధీ ప్రజల తరపున ప్రశ్నిస్తున్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిపై కేసులు నమోదు చేసి ఆయన గొంతును అణచివేయాలని చూడటం సరికాదు. ప్రశ్నించే గొంతును కేసులతో అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు" అని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని, రాహుల్ గాంధీ పై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని అయూబ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేర కార్పొరేషన్ ఛైర్మన్ సంఘ్ వెంకట రాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, 3, 14, 43వ డివిజన్ల అధ్యక్షులు జన్ను అరుణకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజు కుమార్, మాజీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎద్దు సత్యం, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల, యూత్ మహిళా,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మండల, టౌన్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ కు రోజులు

## దగ్గర పడ్డయ్

- వెయ్యి రోజుల పరిపాలన కాదు.. ఇది గుండాల పాలన
- కాంగ్రెస్ నిరంకుశత్వంపై బీజేపీ తీవ్ర మండిపాటు
- వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ శ్రేణులు

**వరంగల్, ఆయుధం:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గుండాల నిరంకుశ పోకడలకు, ప్రతిపక్షాలపై సాగిస్తున్న అరాచకాలకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపు మేరకు, ఆయన ఆదేశాల ప్రకారం జిల్లా బీజేపీ శ్రేణులు తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ శ్రేణులపై, రాష్ట్ర పార్టీపై కాంగ్రెస్ గుండాలు చేస్తున్న దాడులు, వారి నిరంకుశ పనితీరును తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అరాచకాలను చూస్తూ ఊరుకునేది లేదని, ప్రజల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందని హెచ్చరించారు. గుండా రాజకీయాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, త్రి లోకేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, గోకే వెంకటేష్, పొనుగోటి వెంకట్, అంకాల జనార్ధన్, ఎరుకల రఘునారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి, గడ్డం మహేందర్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, అపురూప సాయి, మహిళ నాయకురాలు మార్త ఉషారాణి, బండి సుజాత, తోటకూరి రాజేశ్వరి, జిల్లా నాయకులు పైర్ధ ఆనందు, బైరి శ్యాంసుందర్, చిలువేరు రాజేందర్, జన్ను ప్రభాకర్, ఇనుముల అజయ్, కోమాకుల నాగరాజు, బీజేవైఎం కార్యకర్తలు, పాల్గొన్నారు.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు

## హైకోర్టులో ఊరట





### భూ సేకరణ సర్వే

## పరిశీలించిన కలెక్టర్

**హనుమకొండ, ఆయుధం:** హసన్ పర్తి మండలం కోమిటిపల్లి లో రైల్వే వారికి సబ్ స్టేషన్ ఏర్పాటుకు కావలసిన భూమి కోసం అలాగే జయిగిరి లోని రైల్వే ట్రాక్ దగ్గర నిర్మించ తలపెట్టిన ఆర్వోబి(ROB), ఆర్యుబి(RUB) కి కావాలిసిన భూమి కోసం జరుగుతున్న సర్వే పనులను సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. అనంతరం భీమారం శివారు లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి రెవిన్యూ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఆ తరవాత కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కుడా, రెవిన్యూ, రైల్వే అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యి రైల్వే శాఖ కి సంబందించిన భూ సేకరణ అంశాల మీద చర్చించి తగు సూచనలను తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డివో వెంకటేశ్వర్లు, కుడా పిఓ అజిత్ రెడ్డి, IRSE సైలేష్, DYSO ప్రశాంత్, జిల్లా మత్స్య శాఖ అధికారి పిల్లి శ్రీపతి, ఆర్ అండ్ బీ ఈఈ చరణ్, NPDCL SE సామ్య నాయక్, రైల్వే అసిస్టెంట్ ఎక్సక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వెయ్యి రోజుల పాలన..

## వెయ్యి కిలోల ఉల్లిగడ్డ పంపిణీ

**వరంగల్, ఆయుధం:** సీఎం రేవంత్ రెడ్డి 1,000 రోజుల పాలన సందర్భంగా గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షులు రాజనాల శ్రీహరి ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో 1000 కిలోల ఉల్లిగడ్డలు పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజనాల శ్రీహరి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ఉచిత బస్సు ప్రయాణం 1,000 కోట్లు 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లు, మహిళా సంఘాలకు 60,487 కోట్లు భారీ రుణాలు ఆర్థిక సాయం మహిళా సంఘాలకు 1,900 కోట్లు వడ్డీ రాయితీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మహిళలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలిపాక ప్రసాద్, డిసిసి కార్యదర్శి మధు, అంకిత్, రాజేందర్, కోటేశ్వర్, ప్రభాకర్, విజయ సుందర్, తదితరులు పాల్గొన్నారు.




## 12న ఏపూరి సోమన్న 'సిల్వర్ జూబ్లీ పాటల పోరాటం' సదస్సు

**హన్మకొండ, ఆయుధం:** ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న ప్రస్థానం 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 12వ తేదీన హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో "సిల్వర్ జూబ్లీ పాటల పోరాటం" పేరిట ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థి లోకం పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నా పేరే ఏపూరి - పోరాటమే నా దారి" అని స్పష్టం చేశారు. తెలంగాణ సమాజంలో కవులకు, కళాకారులకు ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించడానికి, వారి పక్షాన నిలబడి ఎదిరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ప్రకటించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో యువత పెడదోవ పడుతూ మాదకద్రవ్యాలు (డ్రగ్స్) బారిన పడుతుండటంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యువతను జాగృతం చేసి సరైన మార్గంలో నడిపించేందుకు అక్టోబర్ నెల నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు, చైతన్య కార్యక్రమాలు చేపడతానని సోమన్న వెల్లడించారు.

## రోడ్లు, డివైడర్ల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- లక్ష్మీపురం CBG ప్లాంట్ స్థల పరిశీలన
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**వరంగల్, ఆయుధం:** నగరంలోని ప్రధాన రహదారులు, డివైడర్లు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలోని పలు ప్రధాన రహదారులు, డివైడర్లు, కూడళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలోని ప్రధాన రహదారులు, డివైడర్లు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై కమిషనర్ టి. వెంకన్న తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రహదారుల డివైడర్లపై చెత్త, మట్టి, ఎండిన ఆకులు, చెట్ల కొమ్మలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డివైడర్లు, ప్రధాన రహదారులు నిత్యం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా కనిపించేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, విధుల్లో అలసత్వం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై బాధ్యత నిర్ధారించి కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సానిటరీ ఇన్స్పెక్టర్లను హెచ్చరించారు. తమ పరిధిలోని ప్రాంతాల్లో ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. అనంతరం లక్ష్మీపురం మార్కెట్ లో మంజూరైన 5 TPD సామర్థ్యం గల కంప్రెస్డ్ బయో మిథనైజేషన్ (CBG) ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. CBG ప్లాంట్‌కు సంబంధించిన వర్క్ టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలకు, నగర పారిశుద్ధ్య నిర్వహణకు ఎంతో ఉపయోగకరమైన ఈ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిన అవసరం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో సీఎం హెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్, ఎంహెచ్ఓ రాజేష్, డీఈలు, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, ఆయుధం:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. దీనిపై రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిగింది. హైడ్రా కమిషనర్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు.

ఏం జరిగిందంటే?

హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి ఎ.వి.రంగనాథ్‌ను తప్పించి.. ఆ స్థానంలో మరొకరిని నియమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలను విచ్చలవిడిగా ధిక్కరించడంతో పాటు, పదేపదే ఉల్లంఘించే అధికారి చట్టబద్ధపాలన (రూల్ ఆఫ్ లా)ను ప్రమాదంలోకి నెట్టివేసే ప్రమాదం ఉందని, అలాంటి వ్యక్తి ఆ పదవిలో కొనసాగరాదని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన అధికారులపై కఠిన శిక్షలకు సిఫార్సు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామం సర్వే నం.1, 2లోని 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న హైడ్రా కూల్చివేతలు చేపట్టడాన్ని సవాలు చేస్తూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టి ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా ఏడాదిన్నరలో 63 కేసులు ఈ ఒక్క అధికారిపై ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఐజీ ర్యాంకులో.. కార్యదర్శి స్థాయిలో ఉంటూ ప్రభుత్వ ఆస్తులను, అదీ జీహెచ్ఎంసీ పరిధిలోని ఆస్తులను రక్షించడం హైడ్రా కమిషనర్ ప్రధాన విధి. ఈ విషయం హైడ్రాను ఏర్పాటుచేస్తూ జారీ అయిన జీవో 99లో స్పష్టంగా ఉంది. అలాంటి అధికారిపై ఏడాదిన్నరలో 63 కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండడం అసాధారణం" అని పేర్కొన్నారు.

# భారత్–అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి
- ఎంపీ కడియం కావ్యకు రైతు సంఘాల నాయకుల వినతి



**హనుమకొండ, ఆయుధం:** మోదీ ప్రభుత్వం అమెరికా తో చేసుకున్న అన్ని రకాల వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్రంపై పార్లమెంట్ లో ఒత్తిడి తీసుకురావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యకు రైతు సంఘాల నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని రైతుల వ్యవసాయ కార్మికుల మరియు పారిశ్రామిక రంగంలోని సంఘటిత అసంఘటిత కార్మికుల జీవితాలను పణంగా పెట్టి బడా కార్పొరేట్ సంస్థలకు బహుళజాతి సంస్థలకు అమెరికా ప్రభుత్వానికి లొంగిపోయి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటుందని వారు విమర్శించారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని 385 రోజులు మహా పడావ్ ఉద్యమాన్ని నడిపించి 736 రైతాంగ ఉద్యమకారుల త్యాగాలతో మూడు నల్ల చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసుకునే విధంగా పోరాడి విజయం సాధించారన్నారు. ఇప్పుడు దొడ్డిదారిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. 2014 సంవత్సరం పార్లమెంటు ఎన్నికల సమయంలో మోడీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి దేశ రైతాంగానికి ద్రోహం చేసిందన్నారు. దేశ గ్రామీణ రైతాంగం మోడీ ప్రభుత్వం అనుసరించే కార్పొరేట్ బహుళ జాతి సంస్థల అనుకూల విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభంలో పడి రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని కేంద్రంపై వారు గజమెత్తారు. రైతుల అప్పులను మాఫీ చేయలేని ప్రభుత్వం దేశ కార్పొరేట్ బడా దోపిడీదారులైన అంబానీ అదాని లాంటి దోపిడీదారుల 16 లక్షల కోట్ల రూపాయల అప్పులను మాఫీ చేసిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, రైతులకు ఉపయోగపడే ఎరువులు, విత్తనాలు పురుగుమందుల ధరలు అరికట్టాలని, వారికి సబ్సిడీ ద్వారా అందజేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కనీస వేతనంగా కార్మికులకు 31 వేల రూపాయలుగా ప్రకటించాలని, రైతుల భూములను విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు నూతన విత్తన బిల్లు లనుఉపసంహరించుకోవాలని రైతుల భూములను బలవంతంగా సేకరించరాదని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి గ్రామీణ వ్యవసాయ కూలీలకు 2 వందల రోజుల పని కల్పించాలని 2006 అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీ కడియం కావ్య కు వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, ఓదెల రాజయ్య, సుధమల్ల భాస్కర్, వల్లందాస్ కుమార్, ఐత నగేష్, బండి కుమార్ తదితరులు ఉన్నారు.

# మూడు దశాబ్దాల తర్వాత... ఒక్కచోట

- సీకేఎం స్నేహబంధానికి చిరునామాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- యూకే నుంచి స్నేహం కోసం వచ్చిన సాంబమూర్తి

**వరంగల్, ఆయుధం:**

మూడు దశాబ్దాల కాలం... మారిన జీవితాలు... వేర్వేరు ప్రాంతాలు... అయినా చెక్కుచెదరని స్నేహం! వరంగల్‌లోని ప్రముఖ సీకేఎం డిగ్రీ కళాశాలలో 30 సంవత్సరాల క్రితం (1996 బీఎస్సీ మ్యాథ్స్ ) కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు హనుమకొండలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో సమ్మేళనం ఆద్యంతం సందడిగా, ఆప్యాయంగా సాగింది.

చాలా సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, కళాశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో చేసిన చిలిపి పనులు, సరదా సంఘటనలు, తరగతి గదిలో జరిగిన ఆసక్తికర ఘటనలను గుర్తుచేసుకుంటూ నవ్వుల్లో మునిగిపోయారు. ఒకప్పుడు కలిసి తిరిగిన స్నేహితులు... నేడు ఎక్కడెక్కడో స్థిరపడినా తమ మధ్య ఉన్న అనుబంధం మాత్రం మారలేదని ఈ సమ్మేళనం మరోసారి చాటి చెప్పింది.



### స్నేహం కోసం.. యూకే నుంచి!


ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అంశం పూర్వ విద్యార్థి సాంబమూర్తి ప్రత్యేకంగా యూకే నుంచి రావడం. కేవలం స్నేహితులను కలుసుకునేందుకు, మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను మళ్లీ పంచుకునేందుకు ఆయన యూకే నుంచి హనుమకొండకు రావడం తోటి మిత్రుల్లో ఆనందాన్ని నింపింది. సాంబమూర్తిని స్నేహితులు ఆప్యాయంగా పలకరించి, ఆయన రాకపై సంతోషం వ్యక్తం చేశారు.

"కాలం మారినా.. దూరాలు పెరిగినా.. స్నేహం మాత్రం చెరిగిపోదు" అన్న మాటలకు ఈ సమ్మేళనం నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. అప్పటి విద్యార్థి జీవితం నుంచి నేటి వరకు సాగిన తమ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. పాత మిత్రులంతా కలిసి ఫొటోలు దిగుతూ, సరదాగా గడుపుతూ తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. మూడు దశాబ్దాల తర్వాత కలిసిన స్నేహితుల ముఖాల్లో కనిపించిన ఆనందం.. గతాన్ని గుర్తుచేసుకున్న కళ్లలో మెరిసిన జ్ఞాపకాలు.. స్నేహబంధాన్ని మరోసారి సజీవం చేసిన ఆత్మీయ పలకరింపులు.. ఈ సమ్మేళనాన్ని ఓ మధుర జ్ఞాపకంగా మార్చాయి. పూర్వ విద్యార్థులు సంజయ్, సమ్మయ్య, స్వామి, నారాయణరెడ్డి, సాంబమూర్తి, వెంకట్, శ్రీనివాస్, చంద్రయ్య, రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖకు అధిష్ఠానం పిలుపు

(మొదటి పేజీ తరువాయి..)
మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. నామినేటెడ్ పదవుల భర్తీపైనా నిర్ణయం ఉండే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు దిల్లీ బాటపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపటి క్రితమే దిల్లీ చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే అక్కడ ఉన్నారు. అయితే పలువురు నేతలు మాత్రం బుధవారం స్వామినాథన్ ఫౌండేషన్‌కి వైఎస్ అవార్డు ప్రదాన కార్యక్రమం కోసం దిల్లీ వెళ్తున్నట్లు చెబుతున్నారు.

## ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు



**హనుమకొండ, ఆయుధం:** హన్మకొండ పట్టణంలోని హంటర్ రోడ్డులో అదాలత్ జంక్షన్ నుండి నీలిమ జంక్షన్ వరకు గల ప్రాంతంలో అనేక పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్న నేపథ్యంలో వారి సురక్షిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని, అలాగే ఈ ప్రాంతంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, పట్టణ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, అలాగే ఆర్ అండ్ బి శాఖ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశీలన అనంతరం, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం న్యూ సైన్స్ కాలేజ్‌కు కొంత దూరం తర్వాత ఉన్న మీడియన్ కటింగ్‌ను ఈ నెల 4వ తారీఖు నుండి తాత్కాలికంగా, ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయడం జరుగుతుంది. ట్రై సిటీ ప్రజలు, వాహనదారులు ఈ మార్పును గమనించి ట్రాఫిక్ పోలీసు అధికారులకు సహకరించాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ, రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ ట్రాఫిక్ పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# భూ రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- 70 గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా సర్వే పనులను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు బాధ్యతాయుతంగా నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తో కలిసి అన్ని జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ సర్వే, భూభారతి, తదితర రెవెన్యూ అంశాలపై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలవారీగా కార్యాచరణ రూపొందించుకొని, దాని ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రామచంద్రపురం గ్రామంలో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసి, రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించేందుకు రూపొందించిన పట్టా పాస్‌పుస్తకాల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత రికార్డులు, రైతుల వివరాలను పక్కాగా పరిశీలించి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అవార్డు గ్రహీత భరత్ కుమార్ కు సన్మానం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరం 40వ డివిజన్ లోని ఉర్సు ప్రాంతానికి చెందిన చీర భరత్ కుమార్ సామాజిక సేవలో, జర్నలిజంలో సేవలు అందించినందుకు ప్రపంచ జానపద దినోత్సవం రోజున మదర్ తెరిసా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కురుమ కుల నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. వరంగల్ జిల్లా మహబూబాబాద్ జిల్లా కురుమ సంఘం నాయకులు చీర అశోక్, నరిగే శ్రీను మాట్లాడుతూ భరత్ కుమార్ కురుమ కుల అభివృద్ధి కొరకు కృషి చేయాలని, కురుమలు రాజకీయంగా అభివృద్ధి చెందాలని వారు తెలిపారు. మండల నరసింహ రాములు మాట్లాడుతూ.. ఎనలేని సేవలు అందిస్తూ ఈ అవార్డు ను అనుకున్నందుకు అభినందనలు తెలిపారు. జాతీయస్థాయి అవార్డు లకు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నాయకులు నరిగే శ్రీను, వరంగల్ కురుమ పెళ్లి పందిరి కన్వీనర్లు మండల నరసింహ రాములు, అన్న రాజు, బండారి అరవింద్, దయ్యాల వీరేశం, భరత్ కుమార్ ను సన్మానించారు.



## 'సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

- టీజీజాక్, TUNTEA రాష్ట్ర కమిటీల పిలుపుతో కేయూలో నిరసన




**హనుమకొండ, ఆయుధం:** పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వక్తలు డిమాండ్ చేశారు. టీజీజాక్, TUNTEA రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఆకుట్, కేయూ ఎన్‌జీఓస్, క్లాస్-4 ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో "సెప్టెంబర్ 1 - పెన్షన్ విద్రోహ దినం" సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. KU NGOs ప్రెసిడెంట్ బూర నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఆకుట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎల్.పి.రాజ్‌కుమార్, కేయూ ఎన్‌జీఓస్ యూనియన్ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, క్లాస్-4 ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ బొక్క మొగిలి, కేయూ సీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటి దామోదర్ మాట్లాడుతూ, ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సుమారు 33 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యోగ సేవ అనంతరం పెన్షన్ భద్రత లేకుండా పదవీ విరమణ చేయడం ఉద్యోగులకు తీవ్ర అన్యాయం అని అన్నారు. పెన్షన్ అనేది ప్రభుత్వం ఉద్యోగులకు చేసే దయ కాదని, దీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు లభించాల్సిన హక్కు అని వారు పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యోగ సంఘాలు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సతీష్ బాబు, తోట ప్రభాకర్, గుమ్మయ్య, అంకుస్, బి.కృష్ణవేణి, మల్లికాంబ, తీర్మాలసింగ్, వాలిపాషా, పి.నర్మద, బి.సృజన, అనిత, జ్యోతి, కల్పన, నవ్య, భూపాల్‌రెడ్డి, వాసు, శివాజీ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు మద్దతుగా నినాదాలు చేశారు.

## వెయ్యి రోజులైనా.. ఒక్క హామీ నెరవేర్చలే

(మొదటి పేజీ తరువాయి..)
అన్నారు. కేసీఆర్ ను 7వ తేదీ వరకు రాజీనామా చేయాలి అంటున్నావ్... మీరు ప్రతిపక్షంలో ఉన్నారా మేము అధికారంలో ఉన్నామా... మీ పార్టీ నాయకులే నీ కండ్లు నెత్తికెళ్లాయ అని అడుగుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను చూస్తే ఎందుకు బయపడుతున్నారు? మేనిఫెస్టోలో పెట్టిన ఏ హామీని నెరవేర్చావు చెప్పు, మీరు అమలు చేయని వాటిని అడగడం తప్పా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు హరిగోస పడుతున్నారని అన్నారు. పరకాల ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లకు ఒక్క రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ పాలనను పక్కనపెట్టి పంచాయతీలు చేస్తున్నారని మండిపడ్డారు. GWMC లో పనిచేస్తున్న సిబ్బంది జీతాలను తగ్గించారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ను ఎలా రాజీనామా చేయడం కాదని.. నీకు దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయి... ఎన్నికలకు వెళ్దామని సవాల్ చేశారు. ఢిల్లీ కి ఇన్ని సార్లు వెళ్ళి తెలంగాణ కు ఏం తీసుకొచ్చావని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695